కన్నీటి కష్టాలు

నియోజకవర్గంలో నీటి కష్టాలు మొదలయ్యాయి. ఎండా కాలం దాటిపోయింది. వర్షాకాలం వచ్చేసింది. ఇరవై రోజుల కిందట విశాఖ మహానగరంలో వర్షాలు కుమ్మేశాయి. రిజర్వాయర్లు నిండాయి. మేఘాద్రిగెడ్డ రిజర్వాయర్ నుంచి సముద్రంలోకి నీటిని వదిలేశారు. నగర పరిధిలో అన్ని ప్రాంతాల్లోనూ నీటి సమస్య ఎలా ఉందో తెలీయదు గానీ.. దక్షిణ నియోజకవర్గ ప్రజలకు మాత్రం నీటికష్టాలు మొదలయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మంచినీటి సమస్య మరింత తీవ్రంగా ఉంది. అధికారులు పట్టించుకోరు. ప్రజాప్రతినిధులకు అసలే పట్టింపు లేదని ప్రజలు వాపోతున్నారు.

- నియోజకవర్గంలో మంచినీటికి వెతలు
- రోజుకు 20 నిమిషాలే మున్సిపల్ నీరు సరఫరా
- గుక్కెడు నీళ్ల కోసం అల్లాడుతున్నామని ప్రజల గగ్గోలు


మంచినీటి కోసం అవస్థ పడుతున్న మహిళలు


సన్నటి ధారను చూపిస్తున్న మహిళ

డాబాగార్డెన్స్: నియోజకవర్గ ప్రజలు గుక్కెడు మంచినీటి కోసం అల్లాడుతున్నారు. మంచినీటి సరఫరా విషయమై ఇటీవల పలు పరిణామాలు చోటు చేసుకున్నా ఇటు అధికారుల్లో గానీ.. అటు ప్రజాప్రతినిధుల్లో గానీ చలనం లేకపోవడం శోచనీయం. 35వ వార్డులో ఆ వార్డు ప్రజలు మంచినీటి కోసం బిందెలతో రోడ్డెక్కారు. సమస్య పరిష్కరించాలంటూ వాహనాలను అడ్డుకున్నారు. స్థానిక కార్పొరేటర్‌ను చుట్టుముట్టారు. 30వ వార్డు వార్డుబాయిలేన్‌లో నీటి సమస్య మరింత జఠిలంగా మారింది. సన్నటి ధారతో 20 నిమిషాలు మాత్రమే నీరు సరఫరా చేస్తున్నారని, కనీసం ఒక్క బిందె కూడా దక్కడం కష్టంగా ఉందంటూ ఆ ప్రాంత వాసులు లబోదిబోమంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు అయిన సందర్భంగా.. నాయకులు ఇది మంచి ప్రభుత్వం అంటూ రోడ్డెక్కారు. ఇదేం మంచో తెలియడం లేదని పలువురు మహిళలు వాపోతున్నారు. అంతెందుకు కూటమి నాయకులు.. కార్యకర్తల ఇళ్లకు మంచినీటి సరఫరా సరిగ్గా ఉందో లేదో ముందు తెలుసుకోమనండి అంటూ పలువురు మహిళలు చెబుతున్నారు.

అరకొర నీటితో అవస్థలు..

నానాటికీ మంచినీటి కష్టాలు మరింత జఠిలమవుతున్నాయి. ఇప్పటికే అరకొరగా ఇస్తున్న మంచినీటితో ప్రజలు అవస్థలు పడుతున్నారు. నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈ దుస్థితి తలెత్తింది. కుళాయిలు ఎప్పుడు వస్తాయా అని ఆశతో ఎదురు చూస్తున్న ప్రజలకు జీవీఎంసీ మంచినీటి సరఫరా సిబ్బంది చుక్క నీటితో వారి ఆశలు ఆవిరి చేస్తోంది.

బోరింగ్‌లు ఉన్నా..

నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న తరుణంలో చాలా చోట్ల బోరింగ్‌లు ఉన్నా.. పనిచేయడం లేదు. ఇప్పటికీ చాలా మంది జీవీఎంసీ సరఫరా చేసే మంచి నీటి పైనే ఆధారపడి ఉన్నారు. మంచినీటి కొరత దృష్ట్యా వార్డుల్లో నిరుపయోగంగా ఉన్న మంచినీటి బోరింగ్‌లకు మరమ్మతులు చేపట్టి వాడుకలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

లీకేజీలతో ఇబ్బందులు..

ఇదిలా ఉండగా భూగర్భ విద్యుత్ సరఫరాకు సంబంధించి ఎక్కడ పడితే అక్కడ రోడ్లు తవ్వేస్తుండడంతో పైప్‌లైన్లు పగిలి మంచినీరు వృథాగా పోతుంది. నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో మంచినీటి పైపులైన్లు పగిలిపోవడంతో నీటి సరఫరా అంతంత మాత్రంగానే ఉంటుందని పలువురు సాక్షి దృష్టికి తీసుకొచ్చారు.

మురికివాడ ప్రాంతాల్లో..

మంచినీటి సమస్య ప్రధానంగా మురికివాడ ప్రాంతాల్లో తీవ్రంగా ఉంది. టౌన్ సర్వే రిజర్వాయర్ సిబ్బంది ప్రతిరోజూ నగర ప్రజలకు ఇచ్చే మంచినీటి సరఫరాను కుదించేయడంతో చాలీ చాలని నీటితో మురికివాడ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సాలిపేట, వార్డుబాయిలేన్, చాకలిపేట, రంగిరీజువీధి, పూర్ణామార్కెట్, దుర్గాలమ్మ గుడి ఏరియా, కల్లుపాకలు, ప్రసాద్‌గార్డెన్స్, పండావీధి, వెలంపేట, రాజారామ్మోహన్‌రాయ్‌రోడ్డు, రామకృష్ణావీధి, రెల్లివీధి, ఆశిపావీధి, కోటవీధి, థాంసన్ స్ట్రీట్, దిబ్బలపాలెం, రామాలయం వీధి, జగదాంబ ఏరియా, దండుబజార్, మహారాణిపేట, పాతనగరంలోని పలు ప్రాంతాల్లో స్థానిక ప్రజలు నీటి సమస్యతో బాధపడుతున్నారు.


కుళాయి మూతపడితే బోరింగే గతి..


సన్నటి ధార.. అదీ రోజుకు 20 నిమిషాలే

పేదోడి గొంతెండుతోంది..



నీటి ఎద్దడి తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో జీవీఎంసీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలి. గుక్కెడు మంచి నీటి కోసం రోడ్డెక్కాల్సి వస్తోంది. వంద రోజుల పాలన తుస్సుమంది. కనీస మౌలిక సదుపాయాల కల్పనలో కూడా కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది. సూపర్ సిక్స్ అన్నారు. ఏవేవో పథకాలన్నారు. అవి అమలవుతాయా? లేదా పక్కన పెడితే పేదోడి గొంతెండుతోంది. ముందు మంచినీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడండి.

–శ్యామల, వార్డుబాయిలేన్

కనీసం గంటైనా సరఫరా చేయాలి..



జీవీఎంసీ సరఫరా చేసే మంచినీటిని రోజుకి గంట పాటైనా ఇవ్వాలి. సన్నటి ధారతో 20 నిమిషాల పాటు ఇస్తే ఏం సరిపోతాయి. ఈ ప్రాంతంలో సుమారు 20 నుంచి 30 కుటుంబాలు ఉన్నాయి. ప్రజా ప్రతినిధులు ఎలాగూ పట్టించుకోవడం మానేశారు. జీవీఎంసీ అధికారులైనా చర్యలు చేపట్టి ప్రజల దాహార్తి తీర్చాలి. సరిపడినన్ని మంచినీళ్లు లేక పిల్లలతో అల్లాడుతున్నాం. తుపాన్లు వచ్చి.. వానలు పడినా మంచినీటికి కటకట ఏమిటో అర్థం కావడంలేదు.

– దైవకుమారి, సాలిపేట

క్లుప్తంగా

కేజీహెచ్ సీఎస్ఆర్ఎంవోకు అభినందనలు


సీఎస్ఆర్ఎంవోను మర్యాదపూర్వకంగా కలిసిన అసోసియేషన్ సభ్యులు

డాబాగార్డెన్స్: కేజీహెచ్ సీఎస్ఆర్ఎంవోగా బాధ్యతలు చేపట్టిన జి. మెహర్‌కుమార్‌ను కేజీహెచ్ వైఎస్సార్‌టీయూసీ, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అధ్యక్షుడు నీలాపు శ్రీనివాసరావు నేతృత్వంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో రాజారావు, అప్పలస్వామి, ఎస్కే బేగం, సీహెచ్ శ్రీదేవి, చంద్రశేఖర్, ఎస్. నాగమణి, తులసి తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు


ఎర్నిమాంబ అమ్మవారికి హారతి ఇస్తున్న పూజారమ్మ విజయమ్మ

కంచరపాలెం: జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఉదయం నుంచి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ. 10, రూ. 50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈవో సురేష్‌బాబా భక్తుల సౌకర్యాలకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎండకు భక్తులు ఇబ్బంది పడకుండా మౌలిక వసతులు కల్పించారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పనులు పర్యవేక్షించారు.

32, 33 వార్డుల్లో 'ఇది మంచి ప్రభుత్వం'


కుమ్మరవీధిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు

అల్లిపురం: గత ప్రభుత్వ పాలనకు, కూటమి ప్రభుత్వ పాలనకు తేడాను ప్రజలు అతి తక్కువ రోజుల్లోనే తెలుసుకున్నారని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. జీవీఎంసీ 32, 33 వార్డుల్లో ఆదివారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు, 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మితో కలిసి నేరెళ్లకోనేరు కమ్యూనిటీ హాల్, 33వ వార్డు కుమ్మరవీధిలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

వంటనూనె అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

మహారాణిపేట: వంట నూనె నిర్ణయించిన ధర కంటే అధికంగా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ హెచ్చరించారు. కృత్రిమ కొరత సృష్టించినా.. అక్రమంగా నిల్వలు చేసినా ఊరుకునేది లేదన్నారు. వంట నూనెల ధరలు అదుపు చేయడం కోసం జిల్లాలోని టోకు వర్తకులు, వంటనూనెల స్టాకిస్టు పాయింట్స్ ఇన్‌చార్జిలతో జేసీ సమావేశం నిర్వహించారు. జిల్లా యంత్రాంగం నిర్ణయించిన ధరకు విక్రయించడానికి టోకు వ్యాపారులు, ఇతర వ్యాపారులు నిర్ణయించారని, ఈ ధరలు తక్షణం అమల్లోకి వస్తాయని తెలిపారు. ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తే 9398142872, 0891–2590100, 0891–2590102 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ తదితరులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి సెయింట్ పీటర్ ప్రధాన దేవాలయ పీపీసీ సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆదివారం వరద బాధితలకు విరాళాలు సేకరించారు. ఈ మేరకు సెయింట్ పీటర్స్ విచారణకర్తలు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ విరాళాల సేకరణ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వస్తు, ధన రూపంలో విరాళాలు సేకరించి ఖమ్మం, కృష్ణ, గుంటూరు ప్రాంతాల వరద బాధితులకు అందించనున్నామని తెలిపారు. అనంతరం కొండవీధి, స్లీప్‌సర్తువీధి, దయాస్‌వీధి, గెడ్డవీధి, పార్కువీధి, పోస్టాఫీస్ వీధి, మాన్యువల్ స్ట్రీట్ ప్రాంతాల్లో విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో ఫాదర్లు ఆంథోనీ రాజ్, వినయ్, పీపీసీ సభ్యులు, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నసమారాధన


అన్నసమారాధనలో పాల్గొన్న పచ్చిరిపల్లి రాము తదితరులు

అల్లిపురం: మెయిన్‌రోడ్డులో గల శ్రీ వరసిద్ధి వినాయక దేవాలయం ఆధ్వర్యంలో ఆదివారం సుమారు 2 వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిరిపల్లి రాము, పీవీఎన్ రెడ్డి, బాబ్జి, సుందర్, పిల్లి శ్రీను అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

దిబ్బలపాలెం లడ్డూ రూ.23 వేలు


పూసర్ల జానకీరామయ్యకు గణపతి లడ్డూ అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: గణపతి ఉత్సవాల్లో భాగంగా 29వ వార్డు దిబ్బలపాలెం యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన స్వర్ణ గణపతి ఉత్సవాలు ఆదివారంతో ముగిసాయి. అసోసియేషన్ గత 25 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలతో వినాయక నిమజ్జన కార్యక్రమం భారీగా జరిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్వామి లడ్డూ ప్రసాదం వేలంలో స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పూసర్ల జానకీరామయ్య (శెట్టి) చిరు వ్యాపారి స్వామి లడ్డూను రూ.23 వేలకు పాడుకున్నారు. గత పదిహేనేళ్లుగా స్వామి లడ్డూని చేజిక్కించుకుంటున్న జానకీరామయ్యను అసోసియేషన్ ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో బండారు త్రినాథరావు, చిటికిరెడ్డి పవన్‌కుమార్, ఉరికిటి గిరీష్, పి. శ్రీనివాసరాజు, కట్టా యశ్వంత్‌కుమార్, బండారు లోకేష్‌కుమార్, అజయ్‌కుమార్, మణికుమార్, తాటితూరి హరి, పసగాడ రామలింగేశ్వరరావు, చందక ప్రభాకర్, పడాల సూర్యకుమార్, తాడి శ్రీధర్, కోండ్ర మణి, జనా, మన్మథ, చంటి, బుజ్జి, కడిమి అనిల్‌కుమార్, గౌతమ్ (మెకానిక్), పాల హరిబాబు, పాల శివ, రమణాజీ, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

'మనో వైద్య శతకం' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ భాగ్యారావు, రచయిత విజయగోపాల్, ప్రముఖ వైద్యులు

మహారాణిపేట: డాక్టర్ విజయగోపాల్ రచించిన మనో వైద్య శతకం పుస్తకం వైద్య విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ప్రభుత్వ మానసిక వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డి అన్నారు. ఈ శతకంలో ఉన్న రెండు గేయాలను పాడి వినిపించారు. అఖిల భారతీయ సాహిత్య పరిషత్ (విశాఖపట్నం) ఆధ్వర్యంలో చినవాల్తేరు ప్రభుత్వ మానసిక వైద్యశాల ఆవరణలో ఆదివారం మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ మోపిదేవి విజయగోపాల్ మానసిక సమస్యలు, వ్యాధులు ఇతివృత్తంగా రచించిన మనోవైద్య శతకం పుస్తకావిష్కరణ సభ జరిగింది. రిటైర్డ్ డీఎంఈ డాక్టర్ జి.భాగ్యారావు చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యుల్లో కూడా రచయితలు ఉన్నారని, ఆ రెండు కలిపితే డాక్టర్ విజయగోపాల్ అని కొనియాడారు. అన్ని రకాల మానసిక సమస్యలను పద్యాలు, ఛందస్సు రూపంలో ఇందులో పొందుపరిచారని, ఈ పుస్తకాన్ని ఆవిష్కరించడం తన అదృష్టమన్నారు. కార్యక్రమంలో ఇండియన్ సైకియాట్రీ సొసైటీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డాక్టర్ జి.వి.ఎస్.మూర్తి, సైకియాట్రిస్ట్ డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ సూర్యారావు, డాక్టర్ ఎం.మోహనరావు, డాక్టర్ మల్లికార్జునయ్య, డాక్టర్ తేజస్వి, డాక్టర్ లోకేశ్వరరెడ్డి, డాక్టర్ మల్లిక, అనంతరామయ్య, డాక్టర్ నరసింహారెడ్డి, దామరాజు విశాలాక్షి, మస్తాన్ రెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు. డాక్టర్ చందన వందన సమర్పణతో సభ ముగిసింది.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి


ఐద్వా ప్రతినిధులతో కలిసి నిరసన తెలుపుతున్న స్థానిక మహిళలు

డాబాగార్డెన్స్: కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనను ఎండగడుతూ 28వ వార్డు పందిమెట్ట వద్ద స్థానిక ప్రజలు ఐద్వా నేతృత్వంలో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్లకార్డుల ద్వారా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకురాలు సత్యవతి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చాక నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కూటమి పరభుత్వం వాటి ఊసే పట్టనట్టుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. 'మాది మంచి పాలన'అని తామే స్టిక్కర్లు అంటించుకోవడాన్ని ఎద్దేవా చేశారు. నిజానికి ఈ వంద రోజుల్లో ప్రజలకి ఒరిగిందేమీ లేదన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, వెంటనే ఇచ్చిన హామీలు అమలు చేయలని, లేదంటే ప్రజలు తిరుగుబాటు చేస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణహాని లేని పరిశ్రమలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న జగ్గునాయుడు

డాబాగార్డెన్స్: ఎల్‌జీ పాలిమర్స్ స్థలంలో ప్రాణహాని లేని పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానికులకు ఉపాధి కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెంకటాపురంలో సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి నిర్మించాలని, మరణించిన మిగిలిని ముగ్గురికి రూ.కోటి చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పరిహారం అందని వారందరికీ నష్టపరిహారం చెల్లించాలని కోరారు. యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి నాలుగున్నరేళ్లుగా బాధితులు పోరాడిన తర్వాత రెడ్‌జోన్‌లో ఉన్న 1825 మందికి 3.5 లక్షలు, మిగిలిన 4860 మందికి రూ.50 వేల పరిహారం చెల్లించడంపై అభినందనలు తెలిపారు. ఈ నష్టపరిహారం సాధించడంలో సీపీఎం, ప్రజల పోరాటాలు కీలకమన్నారు. సమావేశంలో సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యులు బి. జగన్, బి. వెంకట్రావు, పి. వెంకటరెడ్డి, యు. రాజు, ఎస్. రమణ, శ్రీను, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

డాబాగార్డెన్స్: ధరలకు అనుగుణంగా వేతనాలు నిర్ణయించి పర్మినెంట్ ఉద్యోగాలు కల్పించే బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, గతంలో ఎన్ఎంఆర్, డైలీ వేజ్, పార్ట్‌టైం, కంటింజెంట్, క్యాజువల్ ఇలా ఏ పేరుతో పిలిచినా ఐదేళ్లు పూర్తయితే పర్మినెంట్ చేసే వారని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి. వెంకటరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం సమీపాన సిటు కార్యాలయంలో సమాన వేతనం రూ.28,728 చెల్లించాలంటూ ఈ నెల 30న చేపట్టనున్న మహాధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ యజమానులే నేరుగా చట్ట సభలైన అసెంబ్లీ, పార్లమెంట్‌కు ప్రతినిధులుగా వెళ్లడం వల్ల చట్టాలు మార్చేసి, కాంట్రాక్ట్/ఔట్‌సోర్సింగ్ విధానాన్ని ప్రవేశపెట్టారన్నారు. పర్మినెంట్ చేసి ఉంటే అన్‌స్కిల్డ్ కనీస వేతనం రూ.28,728 చెల్లించాల్సి ఉంటుందని, 1994లో తెలుగుదేశం ప్రభుత్వం 2/94 చట్టం తెచ్చాక శాశ్వతంగా పర్మినెంట్ కాకుండా, కాంట్రాక్ట్/ఔట్‌సోర్సింగ్ కార్మికులుగానే కొనసాగిస్తుందని చెప్పారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని దేశవ్యాప్తంగా చేపట్టనున్న నిరసన ప్రదర్శనలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి యు. రాజు, ఉపాధ్యక్షుడు రమణ, నాయుడు, కె. వెంకట్రావు, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ షార్ట్ ఫిల్మ్స్ ఫెస్టివల్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైజాగ్ షార్ట్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం సహకారంతో వైజాగ్ షార్ట్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ నిర్వహిస్తున్న నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ పోస్టర్ ఆవిష్కరణ ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ అష్రాఫ్ మాట్లాడుతూ వైజాగ్ ఫిల్మ్ మేకర్ అసోసియేషన్ ఇప్పటికే షార్ట్ ఫిల్మ్ మేకర్స్ కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించిందని, అందులో భాగంగా దేశంలో ఉన్న అనేక షార్ట్ ఫిల్మ్ మేకర్స్ కోసం తాము నిర్మించిన చిత్రాన్ని ప్రదర్శించుకోవడానికి అవకాశం కల్పిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ షార్ట్ ఫిల్మ్ ప్రదర్శనలో పాల్గొని తమ చిత్రాన్ని ప్రదర్శించుకోవాలని, ప్రదర్శించబడిన ప్రతి సినిమాకు అవార్డు బహూకరిస్తామన్నారు. అసోసియేషన్ కార్యదర్శి ఎల్లాజీ మాట్లాడుతూ ఇప్పటికే 20కి పైగా షార్ట్ ఫిల్మ్ ఎంట్రీలు వచ్చాయని, ఈ నెల 30 వరకు 2 నుంచి 15 నిమిషాల విడివి గల లఘు చిత్రాలు vizagshortfilmmaker@gmail.comకు పంపించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 8919347875 నంబరులో సంప్రదించాలన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో సంతోష్, శంకర్, రావి పట్నాయక్, కృష్ణ, వెంకటరమణ, ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



బీచ్‌రోడ్డులోని కోస్టల్ బ్యాటరీ వద్ద గల డివైడర్లపై ఉండాల్సిన పూల మొక్కల కుండీలు రోడ్డు మీద పడి ప్రమాదకరంగా మారాయి. దీని వల్ల వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుపై పడిన ఈ పూల కుండీల వల్ల ప్రమాదాలు కూడా జరిగే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



శ్రావ్యంగా గాత్ర కచేరీ

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం గాత్ర కచేరీ నిర్వహించారు. చెన్నైకు చెందిన విదుషీమణి డాక్టర్ సుమిత్ర వాసుదేవ్ శ్రావ్యానందకరంగా కచేరీ చేశారు. కార్యక్రమంలో ప్రతి ఏటా అందించే భారతరత్న సుబ్బలక్ష్మి స్మారక పురస్కారాన్ని ఈ ఏడాది ఆమెకు అందించి సత్కరించారు. అకాడమీ అధ్యక్షుడు కె.వి.రామమూర్తి, ఉపాధ్యక్షులు రాజారావు, డాక్టర్ పేరాల బాలమురళి, గౌరవ కార్యదర్శి శ్రీనివాస్, కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి, దుర్గాప్రసాద్‌ల చేతుల మీదుగా పురస్కారాన్ని అందజేశారు. అనంతరం రాంభట్ల కుటుంబ సభ్యులు వారి తల్లిదండ్రులు రాంభట్ల కృష్ణారావు, బాలాత్రిపురసుందరి సంస్మరణ పురస్కార నగదును సుమిత్ర వాసుదేవ్‌కు బహూకరించారు. సభా కార్యక్రమానంతరం సుమిత్ర గాత్ర సంగీత కచేరీకి మంథా రమ్య వాయులీనంపై, ధన్వాడ ధర్మారావు మృదంగంపై, సరస్వతుల హనుమంతరావు ఘటంపై సహకరించారు.

ముగిసిన చండీ సహిత సుదర్శన యాగం

ఆరిలోవ: లోక కల్యాణార్థం బాలభాను అర్చక, పురోహిత సంఘం చేపట్టిన చండీ సహిత సుదర్శన యాగం ఆదివారంతో ఘనంగా ముగిసింది. తోటగరువు దరి ఎర్నిదుర్గమాంబ ఆలయ ఆవరణలో ఈ నెల 18న యాగం ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రతి రోజు విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, గోపూజ, తులసీరాధన, సూర్య నమస్కారాలు, చండీ పారాయణం, చండీ హోమం, రుద్రాభిషేకాలు నిర్వహించారు. ప్రతి రోజు సాయంత్రం 7 గంటల నుంచి పలు దేవతా కల్యాణాలు జరిపించారు. ఈ నెల 18న సీతారామ కల్యాణం, 19న వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యం స్వామి కల్యాణం, 20న శివపార్వతుల కల్యాణం, 21న శ్రీనివాసుడి కల్యాణం, 22న సూర్యనారాయణ స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆగమ పండితులు రేజేటి శ్రీరామాచార్యులు, సుసరాపు చంద్రశేఖర శర్మ, జోష్యుల గోపాలశర్మ సమక్షంలో యాగం చేశారు.

చండీ మాతకు సీపీ పూజలు

సుదర్శన యాగం ముగింపు సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పాల్గొని చండీ మాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు అర్చక సంఘం సభ్యులు సాదర స్వాగతం పలికారు. పూజల అనంతరం సీపీని ఘనంగా సత్కరించారు. సంఘ అధ్యక్షుడు జోష్యుల కామేశ్వరశర్మ, కార్యదర్శి మావుడూరు కిశోర్‌శర్మ, వ్యవస్థాపకుడు వెంకటరమణ శర్మ మాట్లాడుతూ ఈ యాగంలో భక్తులను భాగస్వాములను చేశామన్నారు.